సాక్షి నల్లగొండ

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



డిగ్రీ సీట్లు ఖాళీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 62 డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం పెద్ద సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయి. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 69,310 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 19,850 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,679 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,160 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,791 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.94 అడుగులు
ఇన్‌ఫ్లో	: 845 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 426 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : నల్లగొండకు ఈ నెల 29న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి ఉదయం 11 గంటలకు నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పగిడిమర్రి గ్రామంలో రూ.38 కోట్లతో నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనులు, కొత్తపలి -పగిడిమర్రి, పగిడిమర్రి–మదనాపురం, పగిడిమర్రి–కుదావన్‌పూర్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఐతవారిగూడెం, ముశంపల్లి గ్రామాల్లో రూ.1 కోటితో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి.. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళతారు.

పోలీస్ గ్రీవెన్స్ డేలో వినతుల స్వీకరణ



బాధితుల ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు వెల్లడించారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ : డీఎస్సీ–2024లో ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)కి 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 92 మంది అభ్యర్థులు తప్పనిసరిగా వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లు, లేటెస్ట్ పాస్‌పోర్టు సైజ్ ఫొటో, చెక్ లిస్టు (డీఎస్సీ సైట్ నుంచి లౌన్‌డోల్ అయిన ప్రింట్ కాపీ) వెంట తీసుకు రావాలని సూచించారు.

ప్రభుత్వ గోదాముల్లో ధాన్యం దిగుమతి



ధాన్యం గోదామును పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

నల్లగొండ : కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతికి అన్ని ప్రభుత్వ గోదాములను ఏర్పాటు చేసినట్లు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన సోమవారం నల్లగొండలోని ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌ను తనిఖీ చేసి మాట్లాడారు. గోదాముల్లో వడ్లు త్వరగా దిగుమతి అయ్యేలా చూడాలని మేనేజర్‌ను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 325 కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. సన్న ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా 82 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

నేడు కరాటే సెలక్షన్స్

నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ –14, 17 బాలబాలికలకు కరాటే టోర్నమెంట్ సెలక్షన్స్ ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కరాటే టోర్నమెంట్ సెక్రటరీ డి.విమల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా జిల్లాల ఇన్‌చార్జిలు కరాటే బాల బాలికలతో పాటు వారి సెలక్షన్ లిస్టు, బోనఫైడ్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో మంగళవారం ఉదయం 9 గంటలలోపు నల్లగొండలోని ఇండోర్ స్టేడియానికి హాజరు కావాలని తెలిపారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా హోం డెలివరీ

నల్లగొండ రూరల్ : టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా హైదరాబాద్‌లో పార్సిల్స్ హోం డెలివరీ సదుపాయం కల్పించామని నల్లగొండ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంతోపాటు, ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే పార్శిళ్ల హోం డెలివరీని ఈ నెల 27 నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్‌లో 31 కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పార్శిళ్లను ఏజెంట్లు తీసుకొని హోం డెలివరీ చేస్తారని తెలిపారు.

బదిలీల కుదుపు

రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

- ఉమ్మడి జిల్లాలో ఇద్దరు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓల బదిలీ
- నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇలా త్రిపాఠీ
- రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి బదిలీ
- ఎన్నికల్లేకున్నా ఎక్కువ మంది బదిలీలెందుకంటూ చర్చ



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఇలా త్రిపాఠీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ఎత్తున ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి. జిల్లాల కలెక్టర్ల నుంచి మొదలుకొని అదనపు కలెక్టర్లు, డీఆర్‌ఓ, ఆర్డీఓలు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ బదిలీలు రాజకీయ ఒత్తిళ్లతోనే జరిగాయా.. వారి సొంత ఆప్షన్లా?, లేదంటే ప్రభుత్వ పరంగా మరేమైనా కారణాలు ఉన్నాయా? అన్న చర్చ జోరుగా సాగుతోంది. అయితే ప్రస్తుత బదిలీల్లో రాజకీయ కారణాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఉన్నత స్థాయి అధికారులు బదిలీ అవుతారన్న చర్చ కొంతకాలంగా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని కొంతమంది ముఖ్య ప్రజాప్రతినిధులు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కొందరు ఉన్నతాధికారులను బదిలీ చేయాలని ఆ అధికారుల జాబితాను కూడా అందజేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే సీఎంతోపాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కూడా కలిసి బదిలీలు చేయాలని కోరినట్లు తెలిసింది. ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నతాధికారుల బదిలీలకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

ఒక్కసారిగా అధికారుల బదిలీ

ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా పది మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కారణాలు ఏమైనా పది మంది ఉన్నతాధికారులు బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. జూన్ 16వ తేదీన జిల్లాకు వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డి నాలుగున్నర నెలలకే బదిలీ అయ్యారు. అలాగే అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి కూడా కొద్ది రోజులకే బదిలీ కావడం చర్చనీయంగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ కొండిబా జెండగే 16 నెలల్లో, అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ ఏడున్నర నెలల్లో బదిలీ అయ్యారు. సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్ లత కూడా ఎనిమిది నెలలకే బదిలీ అయ్యారు. మొత్తానికి అధికారులు జిల్లాలో ఎక్కువ కాలం పని చేయకుండా బదిలీ అయ్యారు.

త్రిపాఠీకి ప్రత్యేక గుర్తింపు

నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో టూరిజం డైరెక్టర్‌గా పని చేస్తున్న, 2017 బ్యాచ్‌కి చెందిన ఇలా త్రిపాఠీని ప్రభుత్వం నల్లగొండ కలెక్టర్‌గా నియమించింది. ఆమె గతంలో ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేశారు. అదే సమయంలో మేడారం జాతర ఇన్‌చార్జిగా వ్యవహరించి విజయవంతంగా నిర్వహించారు. ములుగు అదనపు కలెక్టర్‌గా ఉన్నప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డను ప్రసవించిన ఐఏఎస్ అధికారిగా ఆమె గుర్తింపు పొందారు. ఆమె ములుగులో పనిచేస్తున్న సమయంలోనే (2022 అక్టోబరులో), జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా ఆమె భర్త భవేశ్ మిశ్రా పని చేస్తున్నారు. ఆమెకు పురుటి నొప్పులు రావడంతో ఆయన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే వైద్యులు సాధారణ ప్రసవానికి ప్రయత్నించినా కుదరపోవడంతో సిజేరియన్ చేశారు. మరోవైపు ఇలా త్రిపాఠీ ములుగు కలెక్టర్‌గా కూడా పని చేశారు. ఆ తరువాతే టూరిజం డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం అక్కడి నుంచి నల్లగొండ కలెక్టర్‌గా వస్తున్నారు.

నాలుగున్నర నెలల్లో నారాయణరెడ్డి ముద్ర

జిల్లా కలెక్టర్‌గా సి.నారాయణరెడ్డి నాలున్నర నెలలే పని చేసినా జిల్లా పాలనపై తనదైన ముద్ర వేశారు. ఈ ఏడాది జూన్ 16వ తేదీన బాధ్యతలు స్వీకరించిన ఆయన తనదైన శైలిలో అధికారులు, సిబ్బందిని పరుగులు పెట్టించారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో సీరియస్‌గానే వ్యవహరించారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయలు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. నల్లగొండ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ చేసి, అక్కడ ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. మండల స్థాయిలోనూ ప్రజావాణిని నిర్వహించిన కలెక్టర్‌గా గుర్తింపు పొందారు. ధరణి సమస్యల పరిష్కారం, కొత్త రెవెన్యూ చట్టం, భూ సమస్యల పరిష్కారానికి తిరుమలగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసే విషయంలో ప్రత్యేక చొరవ చూపారు.

కలెక్టర్ త్రిపాఠీ బాధ్యతల స్వీకరణ

నల్లగొండ నూతన కలెక్టర్‌గా ఇలా త్రిపాఠీ సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కలెక్టరేట్ పరిపాలనాధికారి మోతిలాల్, పలు విభాగాల అధిపతులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉమ్మడి జిల్లా నుంచి బదిలీపై వెళ్లేవారు..

నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ బదిలీ అయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ కొండిబా జండగే టూరిజం డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. నల్లగొండ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పూర్ణచంద్ర హైదరాబాద్ వక్ఫ్‌బోర్డ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా బదిలీ అయ్యారు. నల్లగొండ డీఆర్‌ఓగా పని చేస్తున్న రాజ్యలక్ష్మి డిప్యుటేషన్‌పై హెచ్‌ఎండీఏకు బదిలీ అయ్యారు. నల్లగొండ ఆర్డీఓ ఎస్.రవి వరంగల్, హన్మకొండ ల్యాండ్ అక్విజిషన్ (ఎల్‌ఏ) స్పెషల్ కలెక్టర్ పీఏగా బదిలీ అయ్యారు. భువనగిరి ఆర్డీఓగా పని చేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పి.అమరేందర్ నల్లగొండ డీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. నల్లగొండ ల్యాండ్ అక్విజిషన్ యూనిట్–2లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం వనపర్తి ఆర్డీఓగా బదిలీ అయ్యారు. దేవరకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న డి.శ్రీనివాసులు గోదావరిఖని ఎల్‌ఏ ఎస్‌డీసీగా బదిలీ చేశారు. యాదాద్రి భువనగిరి అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) పని చేస్తున్న పి.బెన్‌షాలోమ్ నారాయణపేట అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. సూర్యాపేట అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) పని చేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బీఎస్ లత జగిత్యాల అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) బదిలీ అయ్యారు.

జిల్లాకు బదిలీపై వచ్చే వారు..

టూరిజం డైరెక్టర్‌గా పని చేస్తున్న ఇలా త్రిపాఠీని నల్లగొండ కలెక్టర్‌గా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్ రమణారెడ్డిని దేవరకొండ ఆర్డీఓగా బదిలీ చేశారు. హెచ్‌ఎండీఏ, ఓఆర్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వద్ద పీఏగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వై.అశోక్‌రెడ్డిని నల్లగొండ ఆర్డీఓగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్ జె.వెంకటేశ్వర్లును నల్లగొండలోని ఎల్‌ఏ విభాగం ఎస్‌డీసీగా బదిలీ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న ఎం.కృష్ణారెడ్డిని భువనగిరి ఆర్డీఓగా బదిలీ చేశారు. జగిత్యాల అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) పనిచేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంబాబును సూర్యాపేట అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ చేశారు. హెచ్‌ఎండీఏ హైదరాబాద్‌లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జి.వీరారెడ్డిని అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) యాదాద్రి జిల్లాకు బదిలీ చేశారు.

నేడు జిల్లా మార్కెటింగ్ అధికారితో ఫోన్ ఇన్



పత్తి, ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు ఎదువుతున్నాయా. పంటలకు మద్దతు ధర దక్కడం లేదా.. తూకాల్లో మోసం జరుగుతోందా. ప్రభుత్వ కేంద్రాల్లో కొర్రీలు పెట్టి కాంటా వేయడం లేదా. అయితే మీ సమస్యను నేరుగా జిల్లా మార్కెటింగ్ అధికారికి తెలియజేయండి. ఇందుకోసం 'సాక్షి' ఈ నెల 29వ తేదీన జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవితో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతులు నేరుగా జిల్లా మార్కెటింగ్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



ఛాయా దేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి

తేది. 29.10. 2024 మంగళవారం
సమయం : ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 11.00 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ : **73307 33143**

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందంతో కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తుల పరిష్కారాన్ని ఫిర్యాదుదారులకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. మొత్తం 53 ఫిర్యాదులు రాగా రెవెన్యూకు సంబంధించి 26, ఇతర శాఖలకు సంబంధించినవి 27 ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆయన వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. మండలాల్లో ధాన్యం, పత్తి కొనుగోళ్ల వేగవంతం చేయాలన్నారు. మహిళా శక్తి, ఉపాధి హామీ, ఆయిల్‌పాం తోటల పెంపకంపై ప్రత్యేక పెట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంచార జాతుల సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణలో భాగంగా నవంబర్ 4న బీసీ కమిషన్ బృందం జిల్లాకు రానుందని, ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు, సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన వివిధ సామాజిక వర్గాల వారు, ప్రజా ప్రతినిధులతో ఆ బృందం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుందని తెలిపారు. తిరుమలగిరి సాగర్ మండలంలో చేపట్టిన భూ సర్వే, రికార్డుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షకు సహకరించాలి

విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు జన విజ్ఞాన వేదిక- తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సామర్థ్య పరీక్షకు ఉపాధ్యాయులు సహకరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో చెకుముకి సైన్స్ టెస్ట్ వాల్ పోస్టర్‌నుటాయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాల పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నవంబర్ 7న, పాఠశాల స్థాయిలో నవంబర్ 21న, మండల స్థాయిలో 28న, జిల్లాస్థాయిలో డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డి, వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాంపల్లి రాఫెల్, దగ్గుపాటి విమల, జంజిరాల సైదులు, గౌతమి, కవిత పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పథకాలపై అవగాహన

నల్లగొండ : సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీఅధికారుల బృందానికి కలెక్టర్ నారాయణరెడ్డి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాలు, మున్సిపాలిటీల అధ్యయనం పూర్తయిన అధికారుల బృందం సోమవారం కలెక్టర్‌ను కలిసి వారి అనుభవాలను వివరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల బృందం గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధ్యయనం చేయడం మర్చిపోలేని అనుభూతిగా మిగులుతుందన్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించారు. అనంతరం అధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, వివిధ శాఖల అధికారులు కోటేశ్వర రావు, ప్రేమ్‌కరణ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజ్‌కుమార్, శ్రీదేవి, మోతీలాల్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలో సర్వే నంబర్ 825లో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు సోమవారం కూల్చివేయించారు. సర్వే నంబర్ 825లోని భూమి తమదేనంటూ ఇటీవల కొందరు నిర్మాణాలు చేపట్టడంతో పలువురు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను కూల్చి వేయాలని మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం తహసీల్దార్ జవహర్‌లాల్ ఆధ్వర్యంలో అధికారులు ఆయా కట్టడాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జవహర్‌లాల్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూల్చివేతల అనంతరం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేందర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చి వేయిస్తున్న అధికారులు

5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ

నల్లగొండ : ఆసరా పింఛన్లను ఈ నెల 28 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛను మొత్తాన్ని పింఛనుదారులు నేరుగా పోస్టాఫీస్‌లలో పొందాలని సూచించారు.

సీసీఐ కేంద్రాలు ప్రారంభించడంలో నిర్లక్ష్యం



చిట్యాల: ఉరుమడ్లలో నిల్వ చేసిన పత్తిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

చిట్యాల : అధికారులు, పత్తి మిల్లుల యజమానులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కయి నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే సీసీఐ కేంద్రాలు ప్రారంభం కావటం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో రైతులు నిల్వ చేసిన పత్తిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటంతో పత్తి రైతులు దళారులకు పత్తిని అమ్ముకుని ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులకు మద్దతు ధరను అందించాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ మాట్లాడుతూ పత్తి పంటను పండిస్తున్న కౌలు రైతులకు మద్దతు ధర లభించక తీవ్రం నష్టపోతున్నారని, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, పామనగుళ్ల అచ్చాలు, ఐతరాజు నర్సింహ, శ్రీను, రాములు, లింగస్వామి, బెలిజ మల్లయ్య, లింగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ఐదేళ్లుగా నిరీక్షణ!

- 2018లో పీఓటీ చట్టాన్ని సవరించిన అప్పటి ప్రభుత్వం
- ప్రభుత్వ భూములు కొనుగోలు చేసిన వారికి నిబంధనల మేరకు పట్టాలు మార్చాలని ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా ఐదు వేల దరఖాస్తులు
- క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు నివేదించిన రెవెన్యూ అధికారులు
- అప్పటినుంచి ఫైళ్లన్నీ పెండింగ్‌లోనే..



ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

మునుగోడు : పేదలకు ప్రభుత్వం విడుతల వారీగా ప్రభుత్వం భూములని పంపిణీ చేసి పట్టాలు ఇచ్చింది. అలా పంపిణీ చేసిన భూములు అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరం. ఇందుకు సంబంధించి 1977లో బదిలీ నిషేధ చట్టం (పీఓటీ) చేసింది. అయితే ప్రభుత్వం నుంచి భూములు పొందిన వారిలో కొందరు పలు అవసరాల రిత్యా ఆ భూమిని అమ్ముకున్నారు. ప్రభుత్వ భూములు పట్టా మార్పిడీ లేని కారణంగా ఆ భూములు అమ్మిన వారి పేరునే ఉన్నాయి. కొనుగోలు చేసిన వారు ఆ భూములను సాగు చేసుకుంటున్నారు తప్ప వారికి ఆ భూమిపై ఎలాంటి హక్కులు లేవు. అయితే.. అలా భూములు కొనుగోలు చేసిన రైతుల కోసం 2018లో పీఓటీ చట్టంలో కొన్ని సవరణలు చేసింది. నిబంధనల మేరకు వారికి పట్టాలు మార్పిడీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత మండలస్థాయిలో రెవెన్యూ అధికారులు ఆయా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ సైతం జరిపి పట్టాల మార్పిడి కోసం కలెక్టర్‌కు నివేదించారు. కానీ నేటికీ జిల్లాలో ఒక్క రైతు పేరు మీద కూడా పట్టాలు మారలేదు. దీంతో ఐదేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారు.

పట్టాలు మార్చేందుకు నిబంధనలు ఇలా..

ప్రభుత్వ భూమి కొనుగోలు పత్రం కలిగి ఉండాలి. తాను కొనుగోలు చేసిన భూమిని సాగు చేస్తూ కబ్జాలో ఉండాలి. ఆ రైతు చిన్నకారు రైతు అయితే అంతకుముందు 2.20 ఎకరాలలోపు భూమి కలిగి ఉండాలి. ఆ భూమిపై కోర్టులో ఎలాంటి వివాదాలు ఉండొద్దు. ఇలా ప్రభుత్వం పలు నిబంధనలు విధించి అర్హత కలిగిన రైతులకు మాత్రమే పట్టాలు మార్చాలని చట్టంలో సడలింపులు ఇచ్చింది.

పైరవీలు చేస్తే మార్చుతున్నారని సమాచారం..

2022లో మునుగోడు ఉప ఎన్నిక రాగా అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు గ్రామాలను దత్తత తీసుకొని బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం శ్రమించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మునుగోడు మండలంలోని పలివెల గ్రామ ఇన్‌చార్జిగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పలువురు రైతులు పీఓటీ చట్టం ద్వారా తమకు భూమి పట్టా చేయించాలని అభ్యర్థించారు. వెంటనే స్పందించిన ఆయన ఎన్నికల కోడ్ ముగిసినా తరువాత అప్పటి కలెక్టర్ చేత పట్టా మార్పిడీ చేయించినట్లు తెలిసింది. అంతే కాకుండా ఎవ్వరైనా రైతు ఎమ్మెల్యే లేదా ఇతర ప్రజా ప్రతినిధుల చేత పైరవీ చేయిస్తే.. పట్టాలు మార్చుతున్నట్లు తెలుస్తోంది.

నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా..



నేను 20 ఏండ్ల క్రితం కొరటికల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 716లో ఎకరం 5 గుంటల ప్రభుత్వ భూమి కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నా. ప్రభుత్వ భూములు కొనుగోలు చేసిన రైతులకు పట్టాలు మార్చుతున్నారని తెలిసి నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న. కానీ ఇప్పటి వరకు నా పేరు మీద పట్టా చేయలేదు.

– నాగయ్య, రైతు, లక్ష్మీదేవిగూడెం, మునుగోడు మండలం

జిల్లా వ్యాప్తంగా ఐదు వేలకుపైగా దరఖాస్తులు..

జిల్లాలోని 564 రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు కొనుగోలు చేసినా దాదాపు ఐదు వేలకు పైగా రైతులు భూముల పట్టాల మార్పిడీకి ఐదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. సదరు రైతులు కొనుగోలు చేసిన భూమిలో కబ్జాలో ఉన్నారా లేదా, ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో ఉందా లేదా అనే విషయాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి రైతుల వారీగా నివేదికలు సిద్ధం చేసి కలెక్టరేట్‌కు పంపారు. వాటిని కలెక్టర్ ఆమోదించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు పట్టాలు మారకపోవడంతో రైతులు నిత్యం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

క్లుప్తంగా

లారీ కింద పడి వ్యక్తి మృతి

కేతేపల్లి: ప్రమాదశవాత్తు లారీ కింద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలం చీకటిగూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన దిడ్డి మల్లేశం(53) ఐదేళ్ల క్రితం తన కుమార్తె గ్రామమైన కేతేపల్లి మండలం చీకటిగూడేనికి వలస వచ్చాడు. ఇదే గ్రామంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట గల లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయ పార్కింగ్ స్థలం వద్ద నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులకు వెళ్లిన మల్లేశం లారీలు పార్కింగ్ చేసే స్థలం వద్ద మంచం వేసుకుని నిద్రించాడు. రాత్రి 11 గంటల సమయంలో లారీని పార్కింగ్ చేసేందుకు అక్కడకు వచ్చిన డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని రివర్స్ చేస్తూ మంచంలో నిద్రిస్తున్న మల్లేశం పైకి ఎక్కించాడు. తీవ్రంగా గాయపడిన మల్లేశం అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

సాగర్ వెనుక జలాల్లో మునిగి వ్యక్తి మృతి


పాండు మృతదేహం

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీలో సాగర్ వెనుక జలాల్లో మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న కొమ్మరి పాండు(25) సోమవారం వంద మందితో కలిసి బస్సులో విహారయాత్ర కోసం వైజాక్ కాలనీకి వచ్చారు. ఈ క్రమంలోనే సాగర్ వెనుక జలాల్లో స్నానం చేసేందుకు నీటిలో దిగిన పాండు నీట మునిగి మృతిచెందాడు. పోలీసులు పాండు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

డీసీపీఓను తొలగించాలని కలెక్టర్‌కు సిఫారసు

సాక్షి ,యాదాద్రి: భువనగిరిలోని బాలసదన్‌లో బాలికపై లైంగిక దాడి ఘటనను దాచిపెట్టిన డీసీపీఓను విధుల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 14న భువనగిరిలోని బాలసదన్‌లో బాలికపై లైంగిక దాడి జరిగినట్లు డీసీపీఓ, బాలసదన్ సూపరింటెండెంట్‌కు అదే రోజు తెలిసినా, ఆ విషయం బయటకు పొక్కకుండా వారం పాటు దాచిపెట్టారని వారిపై ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు, బాలసదన్ సూపరింటెండెంట్ లలితను సస్పెండ్ చేయాలని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాలికకు జరిగిన అన్యాయాన్ని బయటకు రాకుండా అధికారులు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ క్రమంలో సైదులుపై విచారణ జరిపిన అధికారులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం నుంచి తొలగించాలని కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు సమాచారం.

డిగ్రీ కాలేజీల్లో సీట్లు ఖాళీ

- వివిధ కోర్సుల్లో సగానికి పైగా మిగులు
- డిగ్రీలో చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
- ఏటేటా తగ్గుతున్న అడ్మిషన్లు
- ప్రశ్నార్థకంగా కళాశాలల భవిష్యత్



రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డిగ్రీ కళాశాలల్లో భారీగా సీట్లు ఖాళీగా ఉన్నాయి. కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించడం లేదు. ఏటేటా డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. రెగ్యులర్ డిగ్రీ విద్యపై ఆసక్తి పెంచేందుకు డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, బిజినెస్ ఎనలైటిక్స్ వంటి కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. విద్యార్థులు తమ ఇష్టమున్న సబ్జెక్టులను ఎంపిక చేసుకునేందుకు వీలుగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ అడ్మిషన్ల సంఖ్య పెరగడం లేదు. అడ్మిషన్లు తగ్గుతుండడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఉమ్మడి జిల్లాలో 62 కాలేజీలు..

దోస్త్ ద్వారా ఆన్‌లైన్ సర్వీసెస్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 62 కాలేజీలు ఉండగా అందులో ప్రభుత్వ కాలేజీలు 8, అటానమస్ 3, ప్రైవేట్ ఎయిడెడ్ 2, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ 49 కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 2,940 సీట్లకు 1058 అడ్మిషన్లు, అటానమస్ కాలేజీల్లో 3,120కు 2,350, ఎయిడెడ్‌లో 1,260కు 597, ప్రైవేట్‌లో 16,800కు 5,185 సీట్లు నిండాయి. అన్ని కాలేజీల్లో 24,120 సీట్లను కేటాయించగా 9,190 సీట్లు భర్తీ కాగా 14,930 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే మొత్తంగా అన్ని కాలేజీల్లో కలిపి 60 శాతంకు పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రైవేట్ కాలేజీల్లో 21 శాతం, ప్రభుత్వ కాలేజీల్లో 26 శాతం, ఎయిడెడ్ కాలేజీల్లో 48, అటానమస్ కాలేజీల్లో 76 శాతం అడ్మిషన్లు జరిగాయి.

బీఏ, బీకాంలో ఎక్కువగా..

డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉండగా.. బీకాం, బీఏ కోర్సుల్లో గరిష్ట స్థాయిలో అడ్మిషన్లు జరిగాయి. బీఎస్సీలో మాత్రం అడ్మిషన్లు తక్కువగా ఉన్నట్లు యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇంటర్ సైన్స్ కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆ తర్వాత జేఈఈ మెయిన్స్, ఐఐటీ, ఎంసెట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, నీట్ వైపు ఆసక్తి కనబర్చడం వల్ల డిగ్రీలో అడ్మిషన్ల సంఖ్య పడిపోయాయని వారి కళాశాల యాజమాన్యాలు పేర్కొంటున్నారు.

హైదరాబాద్‌కు వెళ్తున్నారు



ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటం వల్ల హైదరాబాద్‌లో డిగ్రీ చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనివల్ల రూరల్ ప్రాంతాల్లో ఉన్నటువంటి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు భారీగా తగ్గాయి. గవర్నమెంట్ కాలేజీల్లో సీట్ల సంఖ్య పెంచారు. దీంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

– మారం నాగేందర్‌రెడ్డి, టీపీడీ పీఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

బీసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

దేవరకొండ: బీసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐకమత్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు. బీసీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలని పేర్కొన్నారు. చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కులగణన జరిగినప్పుడే అణగారిన వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 14శాతం రిజర్వేషన్లు తగ్గించిందని, దీంతో బీసీలు రాజకీయంగా వెనుకబడ్డారని అన్నారు. తెలంగాణలో త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయబోతుందని అన్నారు. సమావేశంలో నాయకులు ఎర్ర సత్యనారాయణ, నీలం వెంకటేష్, అంజి, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నల్లగాసు జాన్‌యాదవ్, సిరాజ్‌ఖాన్, దుడుకు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి..

కొండమల్లేపల్లి: హక్కుల సాధన కోసం బీసీలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండలో బీసీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనకు కొండమల్లేపల్లిలో బీసీ సంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా ఏకమై బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, నాయకులు కుంభం శ్రీనివాస్‌గౌడ్, అబ్బనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గుండెబోయిన లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్యే బాలునాయక్, బీసీ సంఘాల నాయకులు

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

దేవరకొండ: రుణమాఫీ, పంట రుణాలు ఇచ్చే సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం దేవరకొండలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమర్షియల్ బ్యాంకుల్లో ఉన్న అన్ని సౌకర్యాలు కో–ఆపరేటివ్ బ్యాంకుల్లో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకునేలా చైతన్య పర్చాలని ఆయన మేనేజర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు తావివ్వొదన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్లు దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, జాల నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, డీసీఈఓ శంకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సిరాజ్‌ఖాన్, నాయిని మాధవరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బాలునాయక్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

- రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షుడు దాసు

సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సేవాదళ్ కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షుడు మహంకాళి దాసు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సేవాదళ్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాత్మా గాంధీ చెప్పిన విధంగా అహింస, సత్యాగ్రహం, స్వదేశీ భావజాలంతో సేవాదళ్ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో సేవాదళ్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, 37వ వార్డు కౌన్సిలర్ బైరు శైలేందర్, యువజన కాంగ్రెస్ నాయకులు శబరినాథ్, జిల్లా మహిళా సేవాదళ్ అధ్యక్షురాలు శకుంతలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహంకాళి దాసు

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

చౌటుప్పల్ రూరల్: పట్టపగలు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామానికి చెందిన కొలను ఎట్టమ్మ గ్రామంలో ఒంటరిగా నివాసముంటోంది. ఆదివారం మధ్యాహ్నం ఇంటి బయట కూర్చున్న ఆమె వద్దకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తాగడానికి మంచినీళ్లు కావాలని అడిగాడు. నీళ్లు తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లిన ఎట్టమ్మను వెనుక నుంచి అనుసరించిన సదరు వ్యక్తి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. వృద్ధురాలు కిందపడిపోవడంతో ఆమె కాలు తుంటి విరిగింది. ఎట్టమ్మకు ముగ్గురు కొడుకులు సంతానం కాగా.. వారు హైదరాబాద్‌లో ఉంటుండడంతో ఆమె ఒంటరిగానే అల్లాపురంలో ఉంటుంది. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

భార్య కాపురానికి రావట్లేదని..

- అత్తపై దాడి చేసిన అల్లుడు

నేరేడుచర్ల: భార్య కాపురానికి రావడంలేదనే కోపంతో అత్తపై అల్లుడు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం నేరేడుచర్లలో జరిగింది. ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం చెరువుతండా గ్రామానికి చెందిన బాణోతు సునీతకు నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన లావూడి నాగేశ్వర్‌రావుతో 15 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ముగ్గురు కుమారులున్నారు. గత ఏడాదిన్నర నుంచి సునీత తన పుట్టింటి వద్దనే ఉంటోంది. ఇటీవలే పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదిరినా.. భార్య కాపురానికి రాకపోవడంతో అత్త నీలపై నాగేశ్వర్‌రావు కక్ష పెంచుకున్నాడు. సోమవారం నేరేడుచర్లకు వచ్చిన నాగేశ్వర్‌రావు అత్త నీలను జాన్‌పహాడ్ రోడ్డులో అడ్డగించి ఇనుప రాడ్డుతో ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నీలను స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నీల పరిస్థితి విషయమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవిష్యత్ మొత్తం కమ్యూనిస్టులదే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సూర్యాపేట: పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం ఖాయమని, భవిష్యత్ మొత్తం కమ్యూనిస్టులదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్ఆర్ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మూసీ నది వెంట నివాసముంటున్న పేదలకు ఇళ్లు నిర్మించిన తర్వాతే వారి ఇళ్లను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. రైతు బంధు, రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కకు పెట్టి ప్రజా ప్రయోజనాలు, అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి ఆలిండియా స్థాయి వరకు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నాగారపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

పాత పెన్షన్ విధానం కోసం అలుపెరుగని పోరాటం

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నేరేడుచర్ల: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్వీపర్లు, నైట్‌వాచ్‌మెన్‌లు, స్కావెంజర్‌ల సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వానికి అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అతి త్వరలోనే కళాశాలల్లో కూడా ఈ సమస్య పరిష్కారం కాబోతుందన్నారు. నూతన విద్య విధానంపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదని, అది అమలైనప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, అధ్యాపకుల మనుగడకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరతానని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కళాశాలల్లో ఇంకా మిగిలిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ కోసం కృషి చేస్తానని అన్నారు. అతిథి అధ్యాపకులకు బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ, జీజేఎల్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిమడుగు సైదులు, అధ్యాపకులు అంజయ్య, సునీత, నర్సింహారావు, ప్రణీతి, శ్రీనివాసులు, నరేందర్, వెంకన్న, గణేష్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నాగార్జునసాగర్‌కు స్వల్పంగా పెరిగిన వరద

- రెండు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయానికి సోమవారం సాయంత్రం స్వల్పంగా వరద పెరిగింది. దీంతో రెండు క్రస్ట్ గేట్లను ఆరు అడుగులు మేర ఎత్తి స్పిల్‌వే మీదుగా 19,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 69,310 క్యూసెక్కుల వరద నీరు వచ్చి జలాశయంలో చేరుతుండగా.. ప్రధాన విద్యుదుత్పాద కేంద్రం ద్వారా 29,679 క్యూసెక్కులు, కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా 19,751 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయంలో నీటిమట్టం గరిష్ట స్థాయిలో 590 అడుగులుగా ఉంది.

ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- పీఆర్‌టీయూ టీజీ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

నార్కట్‌పల్లి: త్వరలో జరగబోయే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీజీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పీసీసీ అధికార ప్రతినిధి, ఏఐసీసీ సభ్యుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఇప్పటివరకు 10,300 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నట్లు తెలిపారు. నవంబర్ 6వ తేదీ లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన వారు ఉపాధ్యాయులకు సంబంధించిన ఎటువంటి సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ టీజీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బాలాజీ, జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొడదల శంకర్, ఐక్య గురుకులాల కన్వీనర్ గాదె లింగస్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిమల్ల మణిరాజు, కలింగాచారి, శ్రీధర్‌రెడ్డి, మల్లెపాక వెంకన్న, ఓంప్రకాష్ ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆత్మకూర్(ఎస్): బాలికను వేధిస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామానికి చెందిన బాలిక సూర్యాపేట పాఠశాలలో చదువుతోంది. సూర్యాపేట పట్టణానికి చెందిన మట్టపల్లి ఉదయ్ ఏడాది కాలంగా ఆ బాలిక వెంటపడి వేధిస్తున్నాడు. పలుమార్లు బాలిక కుటుంబ సభ్యులు ఉదయ్‌ను హెచ్చరించినా తీరు మార్చుకోలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు సోమవారం ఆత్మకూర్(ఎస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉదయ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు.

రిమాండ్ ఖైదీ పరారీ

- అదుపులోకి తీసుకుని తిరిగి జైలుకు తరలించిన పోలీసులు

భువనగిరి క్రైం: భువనగిరి సబ్ జైలు రిమాండ్ ఖైదీ పరారైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోక్సో కేసులో మహ్మద్ ఖాజాఖాన్‌ను అనే వ్యక్తిని ఈ నెల 17న భువనగిరి పట్టణ పోలీసులు జుడీషియల్ కస్టడీ కోసం భువనగిరి సబ్ జైలుకు తరలించారు. ఈ నెల 22న మెడికల్ చెకప్ నిమిత్తం అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. అదే రోజు అతడిని పోలీసులు పట్టుకుని సబ్ జైలుకు తరలించారు. ఈ విషయం బయటికి రాకుండా జైలు సిబ్బంది జాగ్రత్తపడినట్లు తెలుస్తోంది. ఖాజాఖాన్‌ను పట్టుకునే క్రమంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయని, సబ్ జైలులో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి బంధువులు ఆరోపిస్తున్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన బౌద్ధ గురువులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని వివిధ బౌద్ధవిహారాలకు చెందిన బౌద్ధ గురువులు సోమవారం సందర్శించారు. సికింద్రాబాద్‌లోని మహాబోధి బుద్ధవిహార్‌లో నిర్వహించిన ‹చీవర దాన› వేడుకల్లో పాల్గొని, అనంతరం బుద్ధవనం మెంటార్ చెన్నూరి ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బౌద్ధ గురువులు, బౌద్ధ భిక్షువులు, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు బుద్ధవనం సందర్శించారు. బుద్ధవనం చేరుకున్న వీరు ముందుగా బుద్ధ చరిత వనంలోని బుద్ధుని పాదాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జాతక పార్కు, స్థూపపార్కు, అవకాన బుద్ధ, ధ్యానవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూప అంతర్భాగంలోని ధ్యామందిరంలో బౌద్ధ సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు నిర్వహించి ధ్యానం చేశారు. వీరికి బుద్ధవనం విశేషాలను బుద్ధవనం మెంటార్ ఆంజనేయరెడ్డి తెలియజేశారు. బుద్ధవనం సందర్శించిన వారిలో బౌద్ధ గురువులు ఎటిక మహాతేరో, ఆనంద్, బుద్ధదత్త, సంఘపాల, బుద్ధపాల బంతేలు ఉన్నారు. వీరితో పాటు హరిప్రసాద్, బుద్ధవనం డిజైన్ ఇన్‌చార్జి శ్యాంసుందర్‌రావు, స్థానిక గైడ్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ విష్ణు ఉన్నారు.


బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న బౌద్ధ గురువులు

అర్ధరాత్రి మందుబాబుల వీరంగం

- కట్టమైసమ్మ ఆలయం ఎదుట బొడ్రాయిపై బీరు సీసాలు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- మున్సిపల్ కార్యాలయం కిటికీ అద్దాలు కూడా ధ్వంసం
- అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు ఎత్తుకెళ్లిన దుండగులు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని మందుబాబులు వీరంగం సృష్టించారు. కట్టమైసమ్మ తల్లి దేవాలయం ఎదుట ఉన్న బొడ్రాయికి బీరు సీసాలను విసిరి పగులగొట్టారు. అదేవిధంగా రాళ్లతో మున్సిపల్ కార్యాలయం కిటికీ అద్దాలను పగులగొట్టారు. జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొట్టి గుడ్లను ఎత్తుకెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న గ్యాస్ స్టౌవ్‌ను వెలిగించి గుడ్లను ఉడకబెట్టుకొని తినడం విశేషం. సోమవారం ఉదయం కట్టమైసమ్మ తల్లి ఆలయాన్ని శుభ్రం చేయడానికి వెళ్లిన వంగూరి సాలమ్మ బీరు సీసాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి స్థానికులను విషయం చెప్పింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, అంగన్‌వాడీ టీచర్ జంగమ్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు వేర్వేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. రేవనపల్లి, పోచంపల్లిలో ఉన్న బెల్టుషాపుల నిర్వాహకుల ద్వారా అర్ధరాత్రి మద్యం కొనుగోలు చేసిన వారి వివరాలు, ఫోన్‌పే, గూగుల్‌పే చేసిన వ్యక్తుల వివరాలపై పోలీసులు ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బెల్ట్ షాపులను వెంటనే మూసి వేయించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి కోరారు.


కిటికీ అద్దాలను పరిశీలిస్తున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు

దుండగులను శిక్షించాలని ధర్నా..

కట్ట మైసమ్మ దేవాలయం బొడ్రాయికి బీరు సీసాలను పగులగొట్టిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోచంపల్లి పట్టణ కేంద్రంలో గాంధీనగర్ దుర్గ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రివేళ గస్తీ పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోటె రాజు, అంకం సాయి, చేరాల సుధీర్, కట్కూరి లింగస్వామి, జయసూర్య, బాలకృష్ణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.